# అమ్మకేం తీసుకెళ్ళాలి?

అందరికీ అన్నీ కొన్నాం. అమ్మకే ఏమీ కొనలేదు. అవును అమ్మకేం తీసుకెళ్ళాలి? పగడాల దండలా? ముత్యాల సరాలా? యాభై దాటిన ఆడవాళ్ళు వేసుకునే బహుళోపయోగ వైటమిన్ బిళ్లల పెద్ద డబ్బానా? ఎలర్జీలు రాని, కడుపులో తిప్పని అతిసున్నితమైన పరిమళమా? ల్యాప్‌టాపా? ఐ ఫోనా?

రెండేళ్ళయిపోయింది మాతృభూమికి వెళ్ళొచ్చి. ఇంకొక ఆదివారం వుంది కొనడానికీ ప్రయాణానికీ... ఆలోగా ఆలోచించుకోవచ్చులే అనుకుంది నందిని. అమ్మ ఏమీ తనకోసం వుంచుకోదు. అన్నీ ఇచ్చేస్తుంది అందరికీ. కొందరమ్మలు అలా కాదు. అమ్మాయి అమెరికా నించి తెచ్చిందని అపురూపంగా దాచుకుంటారు. సూట్‌కేసులు ప్యాక్ అయినా అమ్మకేం కొనాలో తెలియనే లేదు. ఆవిడేమో నాకది కావాలి, ఇది కావాలని అడిగే అమ్మ కానేకాదు కదా!

"ఇంతకీ అమ్మమ్మకీ, నానమ్మకీ ఏం కొన్నావ్?' అని అడిగింది నందినీ సుత.

"అత్తయ్యకి ఏం కొనను?" అని నందిని అడిగితే "అదేమో నాకేం తెలుసు" అని తెల్లముఖం పెట్టేశాడు నందినీ వల్లభుడు.

"ఈసారి నేను నానమ్మ దగ్గరే ఎక్కువ రోజులుంటాను" అని ప్రకటించాడు సుపుత్రుడు.

"వెళ్ళడం మనకి బానే వుంటుంది. అక్కడుండడం ఇంకా బాగుంటుంది. కానీ మనం వెళ్ళే ముందూ, వొచ్చే ముందూ వాళ్ళకి ఎంత పనో పాపం.." అంది నీనా. నందినీ సుత. నానమ్మ గుర్తొచ్చి.

వాళ్ళిద్దరి పట్ల ఆ పిల్ల చూపిస్తున్న చింతకి తనకి సిగ్గేసినట్లనిపించింది. పన్నెండేళ్ల తన కూతురికి వున్న ఆలోచన చదివే కళ్ళజోడు కొనుక్కున్నాక కూడా తనకి రాలేదు. అనుకుంటూ వుండగా ఫోన్ మోగింది. ఇండియా వెడుతోందంటే అవీ ఇవీ పట్టుకుపొమ్మని బ్రతిమిలాడే వాళ్ళల్లో రాధిక చాలా ముఖ్యమైనది జిగిరీ దోస్తు కూడా.... రాధిక వాళ్ళమ్మకి విదేశీ వస్తువుల మీద బహుమోజు. ఇండియాలో బాగా దొరికేవే అయినా సరే అమెరికావి కావాలి. అదొక తృప్తి. అమ్మాయి పంపించిందంటే అందరికీ చెప్పుకోడానికి కాస్త గర్వంగా...

పనికి భంగం లేకుండా స్పీకర్ ఆన్ చేసింది నందిని.

"ఈసారి మా అమ్మని బాగా డిజప్పాయింట్ చేశాం. మేం రావట్లేదంటే ఆవిడ నీరసపడిపోయింది. బోలెడన్ని పచ్చళ్ళు పెట్టిందట. మామిడిరసం తీసి ఫ్రీజ్ చేసిందట. నీకు తెలుసా, ఉన్నది కాక ఇంకో ఫ్రిజ్ కొనిపెట్టింది. అచ్చంగా పచ్చళ్ళకి.. బయట జాడీల్లో వుంటే రంగు మాసిపోతాయట ఫ్రిజ్‌లో వుంటే ఫ్రెష్‌గా వుంటాయట... పిల్లలకి టపాకాయలు కొని దాచిందట. బాత్‌రూముల్లో కమోడ్‌లు మాసిపోయాయని కొత్తవి వేయించిందట... వంటిల్లంతా బాగా వ్యాక్యూం చేయించి మళ్ళీ పెయింట్ వేయించిందట. ఒకటి కాదు ప్రతి రెండేళ్ళకీ ఈ హడావిడంతా వుండేదే. అఫ్‌కోర్స్ పచ్చళ్ళు నువ్వు తెస్తావనుకో... సరేలే ఆవిడేవో అడిగింది అన్నీ ఫెడెక్స్‌లో వేసేసాను. నీకు రేపటిలోగా వచ్చేస్తాయి పట్టుకెళ్ళిప్పు... నా పేరు చెప్పి మామిడి రసం లాగించెయ్" అని ముక్తాయించింది. ఈ నెచ్చెలికి ఎప్పుడూ సూట్‌కేసులో సగం కేటాయించాల్సిందే.

"ఇవన్నీ మన నానమ్మ కూడా చేస్తుందిగా వాళ్ళమ్మ గొప్పేమిటీ" అన్నాడు నందినీ సుతుడు.

"నాకీ స్పెషల్ ట్రీట్మెంట్ నచ్చదు. అందరిలాగా ఫ్రీగా వుండాలి" అంది నీనా.

పడుకుందే కానీ ఎంతసేపటికీ కళ్ళు మూతపడలేదు నందినికి. ఇండియా వెళ్ళేముందు ఎప్పుడూ ఉత్సాహంతో పాటు తెలీని ఒత్తిడేదో వస్తుంది. చప్పున తాతయ్యా, అమ్మమ్మా మనస్సులోకొచ్చేశారు.

"హైకోర్టు పని బడిందమ్మా అందుకని ఇట్టా దిగిపోయాను పొద్దున్నే" అనేసి నాలుగయిదు నెలలకోసారి ఉదయం అయిదుగంటలకే కాలింగ్‌బెల్ మోగించేవాడు తాతయ్య.. ఆ వెనకే చిన్న సంచీ, రెండు టిఫిన్ క్యారియర్లూ పుచ్చుకుని అమ్మమ్మ... నన్ను విడిచి నువ్వు పోలేవులే అన్నట్టు... ఒక విజయగర్వం ఆవిడ మొహాన.

"అట్టా చిక్కిపోవావేమే" అని అమ్మని పరామర్శ చేస్తుంటే నందినికి నవ్వొచ్చేది. అమ్మ ఈ మధ్య బాగా లావయిపోయింది. తగ్గడానికి తంటాలు పడుతోంది కదా మరి!

వచ్చినదగ్గర్నుంచీ అమ్మమ్మ హడావుడి పడేది. అమ్మని ఆఫీస్‌కి పంపించి ఇల్లు సర్దించేది. పొడులు కొట్టేది. మిరపకాయలు తొడిమెలు తీసేది. అమ్మ చీరెలకు గంజి పెట్టించేది. నాన్నకిష్టమని పాలతాలికలు, అమ్మకిష్టమని మురుకులూ, పిల్లలకోసమని వెన్న వుండలూ ఉన్న నాలుగురోజులూ ఊపిరాడకుండా పొయ్యి పట్టునే వుండేది. అమ్మమ్మ ఇంట్లో పెద్ద బాదం చెట్టుండేది. దాని కాయలన్నీ పండి ఎండి నల్లగా అయిపోయి రాలిపడేవి అవన్నీ ఏరి ఒక గుండ్రాయితో కొట్టి పప్పులు తీసి సీసాలో పోసి తెచ్చేది.

"అమ్మమ్మ పెద్దదైపోయినప్పుడు ఆవిడకి బాగా సేవ చేస్తాను" అనేది అమ్మ. అమ్మమ్మ పెద్దదయింది కానీ, సేవలక్కర్లేకుండానే వెళ్ళిపోయింది. అమ్మకి చాలా రోజులు తన తల్లికి ఏమీ చెయ్యలేకపోయాననే అపరాధ భావం వుండేది. అమ్మమ్మ అలా వూరికే వెళ్ళిపోలేదు. తన లక్షణాలైన ప్రేమ, శ్రద్ధ, కూతురి గుండెలో నింపి పోయింది. తన ఇంటర్ చదువు మొదలు అమ్మ చేసిన సేవలు అన్నా? ఇన్నా? ఒక పక్క బాగా చదువుకోమని ప్రోత్సాహం, మరోపక్క మార్కులే ముఖ్యం కాదని కౌన్సిలింగూ చేసేది. హాస్టల్లో వుంటే ప్రతి మూడు రోజులకీ ఒక పెద్ద ఉత్తరం వ్రాసేది. ఇంటి దగ్గర విషయాలన్నీ పూసలు గుచ్చేది. పిల్లలు పుట్టినప్పుడు ఈ చలికి తట్టుకుని చెరి ఆర్నెల్లచొప్పున అమ్మా, అత్తయ్యా ఎంత కష్టం చేశారు? ఇండియాలో వుంటే పిల్లల్ని కనడానికి పుట్టిళ్ళకి పోతారు. అక్కడ అమ్మలకది స్వంత ఇల్లు, స్వంత వూరు. ఇక్కడ స్వదేశం కాదు, స్వంత ఇల్లు కాదు, నూలు చీరెలు కట్టుకోడానికి లేదు. అవి ఉతికి డ్రయర్లో వేస్తే ఉండలు చుట్టుకుపోతాయి.అలవాట్లేని సింథటిక్ చీరెలతో ఆరేసి నెలలు అవస్థ. అమ్మ ఎప్పుడూ ఆఫీస్‌కి గంజిపెట్టిన బెంగాల్ కాటన్ చీరెలు, వెంకటగిరి చీరెలు, కంచికాటన్ చీరెలే కట్టేది. నెలకోసారి అదొక యజ్ఞం. డాబా కడిగించడం, గంజి ఉడికించడం, నేలమీద వాటిని పట్టడం.

అంతేనా? అమ్మకి ఎంతమంది స్నేహితులో! చెప్పాపెట్టకుండా వచ్చేసి కబుర్లు పెట్టుకుంటూ వుంటారు. ఎవరికో అవసరం వచ్చిందని చటుక్కున ఆటో ఎక్కేసి పోతూ వుండేది. ఇక్కడ కంప్యూటరే ఆవిడకి కాలక్షేపం. చాలా గిల్టీగా అనిపించేది. తను తీసుకెడితేనే గడప కదలడం. అలాగే పిల్లల కోసం పదిసార్లు వచ్చింది. సర్దుకుపోవడం, అలవాటు పడ్డం అమ్మల లక్షణం. ఇప్పుడు తను వెళ్లంగానే స్వంత పనులన్నీ పక్కనపెట్టి తనమీదే శ్రద్ధ పెడుతుంది. అమ్మయినా అంతే, అత్తయ్య అయినా అంతే.. వాళ్ళు అంటారు "ఎప్పుడంటే అప్పుడు రారు కదమ్మా!' అని. తమని చూడగానే వాళ్ళ కళ్ళు తడిగా వెలుగుతాయి. ఏరోజుకారోజు పిల్లలుండే రోజు ఒకటి తగ్గిందని లెక్కేస్తారు. ఇంతకీ వాళ్ళకేం తీసుకువెడితే బాగుంటుందో అర్థం కావటం లేదు.

ఏదో స్ఫురించినట్లయి లేచి కూచుని నెట్‌లో చొరబడింది నందిని. తెల్లవారుతూనే

ఒక నూతనోత్సాహం కలిగింది. విమానం ఎక్కేవరకు అంతా హడావిడే. పిల్లలిద్దరూ కల్పించుకుని సహాయం చేస్తుంటే అనిపించింది ఆ వయసులో ఇటు పుల్ల తీసి అటు పెట్టనిచ్చేరా తనని అని. తన కన్నా పిల్లలే నయం.

అనుకున్నట్లే అమ్మా, నాన్నా, అత్తయ్యా, మామయ్య అంతా ఏర్‌పోర్ట్‌కొచ్చారు. అనుకున్నట్లే ఇల్లంతా అద్దంలా పెట్టారు. అనుకున్నట్లే బాత్రూమ్‌లో టాయిలెట్ పేపర్, డైనింగ్ టేబిల్ మీద పేపర్ నాప్కిన్లు అన్నీ అమర్చింది అమ్మ. అనుకున్నట్లే నెలరోజుల కోసం ఒక డ్రయివర్ని, ఒక వంటావిడని పెట్టారు. అనుకున్నట్లే కబుర్లూ, సూట్‌కేసులు విప్పటాలూ, జెట్ ల్యాగులూ అయిపోయాక

"మా అమ్మా, నాన్నా రేపు వెళ్ళిపోతారేమో వాళ్ళని కాసేపు బయటికి తీసుకుపోతాను" అన్నాడు నందిని సహచరుడు.

"ఎవరూ వెళ్ళరు. నేనీసారి మీ అమ్మనీ, మా అమ్మనీ, రాధికా వాళ్ళమ్మనీ ఇంకో ఇద్దరు వాళ్ళ స్నేహితులనీ కలిపి టూర్ పంపిస్తున్నాను. ఎల్లుండే ప్రయాణం. అదే నేను ఈసారి వాళ్ళకోసం తెచ్చిన కానుక" అంది నందిని.

"మీ నాన్నా, మానాన్న కాసేపు చెస్సో, పేకో ఆడేసుకుని కబుర్లు చెప్పుకుంటారు. వియ్యపురాళ్ళిద్దరూ ఈ టూర్లో బాగా స్నేహితురాళ్ళౌతారు. మనం ఇంకనించీ అన్ని రోజులూ అందరం కలిసే వుంటాం. అమ్మలిద్దరూ వచ్చాక మనం మీ ఇంటికి పోతాం. మా అమ్మా, నాన్నా కూడా అక్కడికే వస్తారు. అన్ని రోజులూ అందరం కలిసే వుంటాం వంతులేసు కోకుండా... అది ప్లాను" అంది నందిని.

"మా అమ్మ ఒప్పుకోదు. పిల్లలొచ్చినప్పుడు వూరెళ్ళడానికి. నీ ప్లాను బాగాలేదు" అన్నాడతను.

"పిల్లలు రానప్పుడు ఆవిడ వెళ్లడానికి మీ నాన్న ఒప్పుకోడుగా మరి! గుర్తుతెచ్చుకో. మీ అమ్మ నిన్నెన్నిసార్లు ఎక్స్‌కర్షన్లకి టూర్లకి పంపించిందో? వాళ్ళని హాయిగా తిరిగి రానీ... ఇల్లు నేను చూసుకుంటాను. నేను అన్ని ఏర్పాట్లు చేసేశాను" అంది నందిని తాంబూలా లివ్వడం అయిపోయిందన్నట్లు.

"మరి నాన్నల్ని కూడా పంపిస్తే పోదా?"

"ఈసారికి ఎంత హాయిగా స్నేహితులతో తిరిగిరానీ. వాళ్ళ ప్రయివేట్ కబుర్లు వాళ్ళని చెప్పుకోనీ. వాళ్ళ స్పేస్ వాళ్ళని ఆస్వాదించనీ. ఇక్కడుండి మనం మన నాన్నలకి సేవ చేసుకుని తరిద్దాం... వాళ్ళు చక్కగా వెళ్ళొస్తారు. పదిరోజులు స్వతంత్రంగా వుంటారు. నాన్నలకి విరహంలోని మాధుర్యం తెలిసొస్తుంది" అంది.

అనుకున్నట్టే అమ్మలిద్దరూ వెళ్ళం పొమ్మన్నారు.

"మీరు మాకు చేసిందాంట్లో ఇది వెయ్యోవంతు. మాకు మీరు ముప్ఫై ఏళ్ళు సేవ చేశారు. మీకు మేము ముప్ఫై రోజులు చేస్తాం. ఈసారి మీరిద్దరూ ఇటుపుల్ల తీసి అటు పెట్టరంతే. వెళ్ళకపోతే కుదర్దు" అని నందినితో పాటు నీనా కూడా వంతపాడింది.

"ఈ మధ్యన చాలా కథల్లోనూ అక్కడా ఎన్నారై పిల్లలు తల్లితండ్రుల్ని పట్టించుకోవట్లేదనీ, అక్కడికి పిలిపించుకుని సేవలు చేయించుకుంటున్నారనీ ఇక్కడికొచ్చినా వీళ్ళే సేవ చెయ్యాలనీ, వీళ్ళేమో మమ్మల్నే కదా అమెరికా రమ్మన్నారని ఎగురుకుంటూ పోయి ఇబ్బందులు పడుతున్నారనీ ఒకటే రాసేస్తున్నార్లే. అందుకే మా అమ్మాయి గిల్టీగా ఫీలైపోయి ఇలా ఏర్పాటు చేసుంటుంది" అన్నాడు నందిని తండ్రి.

"పిల్లల్ని విసిగించే తల్లి తండ్రులూ వుంటారు. తల్లి తండ్రుల్ని విసిగించే పిల్లలూ వుంటారు. అందులో కొత్తేం వుంది? ఇండియాలో పిల్లలు మాత్రం అలా ఎంతమంది లేరు? అదొక ప్రిజుడిస్ అంతే.. నా మటుకు నాకు వాళ్ళు పడే కష్టం ముందు మనం ఆరునెలలుండి చేసిందొక లెక్కా? అనిపిస్తుంది. గంటలు గంటలు డ్రయివింగ్. ఒకటే పని. ఇక్కడయితే నాలుగు రోజులు సెలవుపడేసి అమ్మ దగ్గరకి రావచ్చు లేకపోతే అమ్మనే పిలవచ్చు. వంటమ్మాయిని పెట్టుకోవచ్చు. పనివాళ్ళచేత చేయించుకోవచ్చు. అక్కడదంతా కష్టం కదా? ఎక్కడి బాధలు అక్కడివి. ఏం చేసినా కన్న పిల్లలకే కదా? పరాయివాళ్ళకేం కాదుగా!!' అంది నందిని అత్తగారు.

"నీది మరీ అత్యుత్సాహంలే అమ్మా! వచ్చేవాళ్ళు నీ పిల్లలే కదా? వాళ్ళనో పెద్ద వి ఐ పీల్లా చూస్తావు... ఆ గారానికి మెచ్చే నీ మనమడు నీ దగ్గరే ఎక్కువ రోజులుండాలన్నాడు" అన్నాడు ఆవిడ కొడుకు.

"చాన్నాళ్ళదాకా కనపడరుగదయ్యా! అందులో తప్పేం వుందీ.. మా మనసుకి అట్టా అనిపిస్తుందంతే. చూసేవాళ్ళకి ఎట్టా అనిపిస్తే నాకేమిటీ? మీరొచ్చి వెళ్ళిన పదిరోజులూ మనసులో నిలిచిపోవాలని వుంటుంది. మాకు చేతనయినదంతా చెయ్యాలని వుంటుంది. ఇదిగో నీ కూతురు చూడు నా మెడమీద చెయ్యేసి నుంచుంది. ఇట్టా మళ్ళీ దాన్ని నేను ముట్టుకోవాలంటే ఎన్నాళ్ళు ఎదురుచూడాలి చెప్పు? మీరు మాకు ఎన్నారైలు కాదు. మా పిల్లలు చాలా కాలం తరవాత మా గడపలోకొచ్చిన పిల్లలు అంతే..." అందావిడ కొంగుతో కళ్ళు తుడుచుకుని.

నందిని కళ్ళల్లోకీ నీళ్ళొచ్చాయి.

"మీ అలసటలు తీరేదాకా రావద్దులే అనుకున్నాను." అంటూ ఒక పెద్ద సంచీతో వచ్చింది రాధిక తల్లి సువర్ణ.

"పిల్లలూ, ఇదిగో టపాకాయలు కాల్చుకోండి మా రాధమ్మ పిల్లలొస్తారని

కొనిపెట్టా. తెలుసుగా. వాళ్ళొచ్చినప్పుడే ప్రతి యేడూ దీపావళి చేస్తాన్నేను... బాంబులు లేవులే అన్నీ పైకి పోయి పూలు రాల్చేవే.. చాలా మంచిపని చేశావే అమ్మడూ. జయపూర్, ఉదయపూర్; ఢిల్లీ, ఆగ్రా చూడాలని ఎన్నాళ్ళబట్టో కోరిక ! చూడేలేదు నేను... మా ఆయన సరేసరి. సన్యాసం పుచ్చుకున్నట్టే వుంటాడు. దేనిమీదా మనసు లేదు" అందావిడ గజ్జలు మోగించినట్టు నవ్వుతూ.

"ఇదుగో అమ్మమ్మా! రాధిక ఆంటీ ఇచ్చిన ప్యాకెట్" అంటూ నీనా ఆవిడకో పెద్ద ప్యాకెట్ ఇచ్చింది.

"సువర్ణకి రోజూ వాడే వస్తువులు కూడా అమెరికావే కావాలి"అంది నందిని తల్లి గీత.

"అదంతేలే! అది మన సొసైటీలో ఒక గౌరవం. నీకు తెలీదు. అట్లా చూపించుకుంటూ వుండాలి. ఏమిటో ఈ ఫాల్స్ ప్రిస్టేజీలనకు... వాటితోనూ పనుంది" అంది రాధిక తల్లి మళ్ళీ గజ్జెలు మోగించి.

"భేషజాలకి అత్యుత్సాహానికి పేరుపడిపోతున్న ఆ తల్లుల కళ్ళల్లో ఒకింత గర్వం వుంటే వుండొచ్చు కానీ అమ్మాయినో, అబ్బాయినో చూడాలనంగానే రైలో, బస్సో ఎక్కేసి, ఏ తెల్లవారు ఝామునో కాలింగ్‌బెల్ నొక్కేసి, అమ్మాయినో, అబ్బాయినో ఆశ్చర్యంలో ముంచి తేల్చే అవకాశం లేదనే విచారం వుంది. ఆ విచారాన్ని కప్పిపుచ్చుకునే అత్యుత్సాహమూ వుంది. అదే అకాల దీపావళీల ఫ్రోజెన్ మామిడిరసాల అవతారం ఎత్తుతోంది" అనుకుంది నందిని. ✻

*'భూమిక', జులై 2011*

కథా నిలయం
శ్రీకాకుళం